

# మనసొంపుగా

## రొటీన్ కు భిన్నంగా

ఆకాశం వేకువఝామున చాలా అందంగా వుంటుంది స్వచ్ఛంగా నిర్మలంగా వుండే నీలాకాశాన్ని చూస్తూ ఎంతసేపయినా గడిపేయాలనిపిస్తుంది. వర్షంపడే రోజు తప్ప మిగతా రోజులన్నీ ప్రభాతవేళ మనసుకు అనిర్వచనీయమైన ఉల్లాసాన్ని కలుగచేస్తాయి. అన్ని కాలాలలోను తెల్లవారుజామున ఆకాశాన్ని చూడడం నాకెంతో ఇష్టం. అందులో వేసవికాలంలో మరీను... వేసవిలో భళ్ళున తెల్లవారిపోతుంది.

ప్రకృతి యావత్తూ అకస్మాత్తుగా చైతన్యమవుతుంది. గాలి తిమ్మెరలు తనువును సుతారంగా తాకుతూ తన్మయత్వాన్ని కలిగిస్తాయి.

"హాయ్! అవుడే నిద్రలేచిపోయావే! రాత్రి నిద్రపట్టలేదా? చిరునవ్వుతో పలకరించింది వందన.

"హలో గుడ్‌మార్నింగ్. రాత్రి బ్రహ్మాండంగా నిద్రపోయా" అన్నాను వెనుదిరిగి వందన వంక చూస్తూ.

"అబ్బో! ఏంటే ఈవేళ విశేషం. అవుడే స్నానంకూడా చేసేసినట్టున్నావే!" ఆశ్చర్యంగా అడిగింది వందన

"అవునే! ఏ సీజన్‌లోనైనా సరే. సూర్యోదయానికి ముందే కాలకృత్యాలు పూర్తి చేసుకొని స్నానం చేసేస్తే ఎంత ఫ్రెష్‌గా వుంటుందో తెలుసా? ఆ ఫ్రెష్‌నెస్ రోజంతా వుంటుంది.

"సరేలే. ఆ అదృష్టం అందరికీ వుండొద్దు! నాకైతే ఎర్లీమార్నింగ్ లేవాలంటే మహాబద్ధకం. కనీసం ఏడున్నరవరకైనా మంచం దిగాలనిపించదు".

"అది మంచి పద్ధతి కాదు. ఒక్కసారి ఇలా నా ప్రక్కన కూర్చొని ఆకాశాన్ని, పక్షుల్ని, చెట్ల కొమ్మల్ని, మెల్లగా వీచేగాలిని, ఎంజాయ్ చేయి. ఎంత ఆహ్లాదకరంగా వుంటుందో చూడు..." అంటుండగానే వందన ప్రక్కనే వున్న టేప్ రికార్డర్ చూస్తూ,

"అదే! నాదస్వరం క్యాసెట్ నువ్వు తెచ్చి పెట్టావా? నేనిందాకటినుంచి ఇంత ప్రొద్దునే మంగళవాయిద్యం ఎవరింట్లో వినిపిస్తోందా అని లేచి వచ్చాను. ఆహా... దూరంగా గుళ్ళోంచి వినిపించే వేంకటేశ్వరుని సుప్రభాతం, ప్రక్కనే స్టీరియోలో నాదస్వరం వాయిద్యం, ఎర్లీమార్నింగ్ ఫ్రెష్‌నెస్... అబ్బ. ఎంజాయ్‌మెంట్ అంటే నీదేనే! ఏమైనా ఎంజాయ్ చేయడానికి పెట్టి పుట్టాలి. ఇన్ని సంవత్సరాలుగా ఈ ఇంట్లో ఈ పరిసరాల్లో వుంటున్నానన్న మాటే గాని ఏనాడూ ఉదయంపూట ఇంత రిలీఫ్ పొందలేదు. కాని చుట్టం చూపుగా నిన్న వచ్చిన

నువ్వు మాత్రం హ్యాపీగా ఎంజాయ్ చేసేస్తున్నావ్. నిన్ను చూస్తే జెలసీగా వుందోయ్" అంది నందన నా ప్రక్కనే కుర్చీలో కూర్చుంటూ.

"నీకు పెద్దగా బాధ్యతలేవీ లేవు కాబట్టి ప్రొద్దుటే లేవాల్సిన అవసరం వుండదు. కాని నాకు తప్పదు కదా! అందుకే ప్రొద్దున లేవడం అలవాటైపోయింది. నిజానికి ఈ టైమ్‌లో మా ఇంట్లో నేనెంత హడావుడిగా వుంటానో తెలుసా? నిద్రలేచినప్పటినుంచి స్కూల్‌కి బయలుదేరేవరకు యమటెన్షన్. ఆ టెన్షన్‌తోనే ఇవాళ ఎర్లీగా లేచాను. తీరా లేచాక తెలిసింది. ఇవాళ నాకేం డ్యూటీస్ లేవని, దానితో ఎంతో ఫ్రీగా అనిపించింది" అన్నాను.

"ఆ టెన్షన్స్‌నుంచి రిలాక్సవడానికేగా నువ్వు ఇక్కడికి వచ్చింది! హ్యాపీగా రెస్ట్ తీసుకో, 'వుండు కాఫీ తెస్తాను' అని నందన లోపలికెళ్ళింది.

కాసేపు ఆవరండాలో అలాగే కూర్చున్నాను. ఈ టైంలో రోజూ ఎంతో గందరగోళంగా వుండేది. పిల్లల్నిద్దరినీ నిద్ర లేపడం వాళ్ళ స్నానానికి ఏర్పాట్లు చూడడం, స్కూల్ డ్రెస్ రెడీ చేయడం, భోజనం క్యారేజీలు సర్దడం, ఆయనకి, పిల్లలకి టిఫిన్ తయారుచేయడం, అంతా హడావుడి. పిల్లలిద్దరూ ఇంకా మరీ చిన్న పిల్లలవడంతో మరీ పని ఎక్కువగా వుంటోంది. వాళ్ళకి పుస్తకాల బ్యాగ్ సర్దడం దగ్గరినుంచి సాక్స్, షూస్ వేయడంవరకూ అన్నీ నేనే చేయాలి. వాళ్ళకు వాళ్ళుగా రెడీ అయ్యే వయసింకా రాలేదుగా, అన్నిటికంటే నా పనినేను పూర్తి చేసుకొని స్కూల్‌కి ఇన్‌టైంలో చేరడం మరీ టెన్షన్. ఫస్ట్‌బెల్‌కల్లా స్కూల్‌లో లేకపోతే హెడ్‌మిస్ట్రెస్ గుడ్లురిమి చూస్తుంది. ఈ హడావిడిలో నా క్యారేజ్‌నికూడా సర్దుకోకుండా స్కూల్‌కి వచ్చేస్తాను.

...ఎంత చురుక్కుమంటూ ముఖాన్ని తాకుతుండడంతో ఈ లోకంలోకి వచ్చాను. లేచి వంటింట్లోకి వెళ్ళబోతూ క్షణంసేపు ఆగిపోయాను. వంటగది ప్రక్కనేవున్న దేవుని మందిరంనముందు నందన దీపారాధనచేసి, అగరవత్తులు వెలిగించి పూజచేసి దణ్ణం పెట్టుకుంటోంది. 'అరె. దీనికింత భక్తి ఎప్పటి నుంచి అలవడిందబ్బా' అనుకుంటు గుమ్మానికి ఆనుకొని నిలబడ్డాను.

నందన లేచి వెనక్కి తిరిగి నన్ను చూసి నవ్వుతూ.

"నీ ప్రభావమే తల్లీ! స్నానం చేసేసి ఫ్రెష్‌గా వున్న నిన్నుచూసేసరికి నాకూ వెంటనే షవర్ బాత్ చేసేయాలనిపించింది. అంతే. ఇపుడు చాలా హ్యాపీగా వుంది. పద కబుర్లు చెప్పుకుంటూ టిఫిన్ రెడీ చేద్దాం. టిఫిన్ తర్వాతే కాఫీ. ఈలోగా మా వారు ఎలాగూ లేస్తారు" అంటుండగానే

"హలో... నేను లేచి అరుగంటలైంది. ఇంత ప్రొద్దుటే దేవుడి గదిలో గంట మోగుతుంటే ఇవాళేదైనా పండగేమోనని ఉలిక్కిపడి లేచాను. ఏమైంది నీకు? నేను లేచి కాఫీపెడతేగాని పక్క దిగని దానివి ఇవాళ ముందే లేచిపోయావ్" అన్నాడు నందన భర్త సుందర్.

"లేచి పోవడమేమిటి అసహ్యంగా. మీ నోట మంచిమాటే రావు కదా" అని వంటింట్లోకి వెళ్ళిపోయింది నందన.

"నమస్తే టీచర్‌గారు, రాత్రి పొద్దుపోయి వచ్చా. అందుకే మిమ్మల్ని పలకరించలేదు. మీరప్పటికే నిద్రపోతున్నారు' బహుశా ఎర్లీగా నిద్రపోవడం మీకు బాగా అలవాటనుకుంటా" అన్నాడు సుందర్.

నేను సుందర్‌కి ఎదురుగా వున్న సోఫాలో కూర్చుంటూ.

"నాకంత అదృష్టం కూడానా! సాయంత్రం స్కూల్‌నుంచి రాగానే పిల్లలకి స్నానాలు చేయించడం, తినడానికి ఏదైనా పెట్టి వంట పూర్తి చేసేసరికి ఏడున్నరైపోతుంది. ఇక వాళ్ళ చదువులు, హోంవర్క్‌లు చేయించి అన్నంపెట్టేసరికి తొమ్మిది– ఈలోగా ఆయన వస్తారు. ఇద్దరం భోజనం చేసేటప్పటికి పదైపోతుంది..." అని ఇంకా ఏదో చెప్పబోతుండగా,

"ఇది చాలా మంది ఇళ్ళల్లో వుండే రొటీన్ టైంటేబులే కదండి" అన్నాడు సుందర్.

"సరే! మీకలాగే అనిపిస్తుంది. ఆ తర్వాత నా స్కూల్ పిల్లల పుస్తకాలన్నీ ముందేసుకొని కరెక్షన్స్ చేయడం, పేపర్లు దిద్దడం... అవి ఇవీ అన్నీ పూర్తి చేసుకునే సరికి ఎంత టైమవుతుందో తెలుసా?" అన్నాను కాస్తంత కోపం నటిస్తూ.

"అయ్యబాబోయ్ కోపగించుకోకండి. అయినా అన్ని కష్టాలు, పడుతూ ఎందుకండీ ఉద్యోగం చేయడం హాయిగా నందనలాగా ఇంటి పని, వంటపని, మొగుడిపని చూసుకుంటూ హాయిగా కాలక్షేపం చేయొచ్చుకదా!" అన్నాడు సుందర్.

ఇంతలో నందన వచ్చి టిఫిన్ ప్లేట్లను నాకు, సుందర్‌కు అందిస్తూ,

"ఆహా... అద్భుతమైన సలహా ఇచ్చారు. మరి ఆ బుద్ధి నిన్నటిదాకా ఏమైంది? చూడవే. నన్నుకూడా ఏదైనా ఉద్యోగంలో చేరమని నిన్నటిదాకా తెగ గొడవచేశారు. నేను చచ్చినా ఉద్యోగం చేయనని తెగేసి చెప్పేశాను. సంపాదించుకురా. వండిపెడతాను అంటే అన్నాను. దానితో నోరుమూసుకున్నారు. నీకు మాత్రం ఉచిత సలహాలిస్తున్నారు" అంది నందన.

"ఇపుడు మా కింకా పిల్లా, పాపా ఎవరూ లేరు కాబట్టి కొంతకాలం ఉద్యోగం చేయొచ్చుగా" అన్నాను.

"నువ్వూ ఆయనకు వంతపాడుతున్నావా? నాకు ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏముంది? నిజం చెప్పు, నీ సంగతి వేరు. కాని నేను ఉద్యోగం చేయడం అనవసరం. నా బదులు ఆ ఉద్యోగం చేసే అవకాశం మరో మనిషికి లభిస్తుంది. వాళ్ళ అవసరం తీరుతుంది. లేనిపోని టెన్షన్స్‌తో విలువైన జీవితాన్ని వృథా చేసుకోవడం నాకిష్టం వుండదు" ఖండితంగా చెప్పింది నందన.

"నువ్వు చెప్పింది నిజం నందన. నీ నిర్ణయాన్ని నేను అభినందిస్తున్నాను. అవసరం లేకపోయినా, కేవలం కాలక్షేపంకోసం ఉద్యోగం చేస్తున్నామనిపించుకోవడంకోసం, ఇంకా సంపాదించేయాలన్న అత్యాశతోను ఉద్యోగాలు చేస్తున్న వాళ్ళు చాలా మంది వున్నారు. వారివల్ల నిజంగా ఆర్థిక ఇబ్బందుల్లో వున్న వారికి అవకాశాలు తగ్గిపోతున్నాయి. కాంపిటీషన్ పెంచే ఇటువంటి ధోరణి నాకూ నచ్చదు. ఉదాహరణకి మా స్కూలే తీసుకుందాం. ఈ ఏడాది నలుగురు టీచర్లు అకస్మాత్తుగా ఉద్యోగం మానేశారు. నిజానికి వాళ్ళకి ఆ టీచర్ ఉద్యోగం చేసే అవసరం లేదు. దాని ప్రభావం వారి పనితీరుపై బాగా వుండేది. చివరికి హెడ్‌మిస్ట్రెస్ గట్టిగా మందలించేసరికి కోపంతో ఉద్యోగం మానేశారు. దీనివల్ల అటుపిల్లలు, ఇటు యాజమాన్యం ఎంతో ఇబ్బందిపడింది. ఫలితంగా మాపైన పనిభారం పెరిగింది" అన్నాను.

"అందుకేగా రిలీఫ్‌కోసం వచ్చావ్! హాయిగా రిలాక్సయిపో" అంది నందన.

'మీతోపాటు పిల్లల్ని మీవారినికూడా తీసుకురావలసింది" అన్నాడు సుందర్.

"లేదు సుందర్. పిల్లలేమో మా అన్నయ్య ఇంటికి వెళ్ళారు. ఈ సెలవులను అక్కడే గడిపేస్తారు. ఇక మా వారికి ప్రస్తుతానికి తీరికలేదు. అందుకే నేను ఒక్కదాన్నే వచ్చాను. రోజువారీ టెన్షన్స్‌నుంచి రిలాక్సవ్వాలంటే ఇలా ఎక్కడైనా దూరంగా కొన్ని రోజులు గడపడం చాలా అవసరం అనిపించింది' అన్నాను.

'అవును. రొటీన్ లైఫ్ ఎప్పుడూ మెకానికల్‌గా వుంటుంది. దాన్నుంచి డైవర్ట్ అయినపుడే లైఫ్‌లో ఎంజాయ్‌మెంట్ వుంటుంది. ఇపుడు మీరొచ్చారుకదా! ఇక నందన రొటీన్‌లైఫ్‌కి ఫుల్‌స్టాప్ పెట్టేస్తుంది. మీరిద్దరూ కలిసి హాయిగా ఎంజాయ్ చేసేయండి" అంటూ సుందర్ పేపర్ చదవడంలో నిమగ్నమైపోయాడు.

నేను, నందన ఆరోజు ప్రోగ్రామ్‌ని ఫిక్స్‌చేసుకోవడంలో నిమగ్నమైపోయాం.

–'మోతీలాస్య'